క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ సబ్జెక్ట్‌ను బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్ట్‌లో 50శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలన్నారు.

వెండి పాదుకలు, శఠారి, పళ్లెం వితరణ



వితరణ చేస్తున్న దాత నరసింహారావు

నేలకొండపల్లి: స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సూర్యాపేట జిల్లా కోదాడ మండలం అలవాలపురంకు చెందిన కనగాల నరసింహారావు స్వామివారికి రూ.95 వేల విలువైన వెండి పూజా సామగ్రిని వితరణగా అందించారు. వెండి పాదుకలు, శఠారి, పళ్లెంను అందించగా.. అర్చకుడు తుపురాణి మధుసూదనాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతను పాలకవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈఓ పి.నారాయణచార్యులు, దేవాలయం చైర్మన్ రాయపూడి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మోర మల్లయ్య, కైలాసపు వెంకటేశ్వర్లు, మణేమ్మ భక్తులు దేవరశెట్టి వెంకటేశ్వర్లు, సీత, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ కళ్యాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని 11 కేవీ రామాలయం ఫీడరు పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్–2 విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బుర్హాన్‌పురం, డీఆర్‌డీఏ ఆఫీస్, నేతాజీ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పాలాభిషేకం

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి గ్రామస్తులు పాలాభిషేకం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గువ్వలగూడెం వద్ద అండర్ పాస్ బ్రిడ్జి కావాలని గ్రామస్తులు కోరారు. ఈనేపథ్యంలో తుమ్మల చొరవతో బ్రిడ్జి మంజూరు కావడంతో గ్రామస్తులు శుక్రవారం తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 26వ డివిజన్ రామకృష్ణనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ శనివారం పరిశీలించారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు మేయర్ తెలిపారు. పనులను పూర్తి నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ నవ్యజ్యోతి, ఏఈ శోభన్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో డిపాజిట్లపై అధిక వడ్డీ

కూసుమంచి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ పొందవచ్చునని కూసుమంచి బ్రాంచ్ మేనేజర్ పాముల మంగయ్య ఒక ప్రకటనలో తెలపారు. బ్యాంకులో సహకారమిత్ర డిపాజిట్ పథకం ద్వారా 333 రోజులకు 7.5 శాతం వడ్డీ, సహకార సంరక్షణ పథకం కింద 364 రోజులకు 6.25 శాతం వడ్డీ, సహకార మిత్ర పథకం ద్వారా 700 రోజులకు 6.5 శాతం వడ్డీ లభిస్తున్నందని పేర్కొన్నారు.

నివాళి

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండాలో అనారోగ్యంతో ఇస్లావత్ మంగమ్మ (70) మృతిచెందింది. శుక్రవారం మంగమ్మ భౌతిక కాయాన్ని వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల పీఏ నంద్యాల రవీందర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గుగులోత్ రూప్లానాయక్, డివిజన్ అధికార ప్రతినిధి సైదులు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆరిఫ్, నాయకులు ఉపేందర్, భూక్యా కోట్యా పాల్గొన్నారు.

శ్రమ దోపిడీని అరికట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, శ్రమకు తగిన ఫలితం పొందలేకపోతున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ నాయకులు కంకనాల శ్రీనివాస్, కొయ్యల శ్రీనివాసు, జెట్టి గురవయ్య, పేరబోయిన వెంకన్న, గూగులోత్ పటేల్, కిన్నెర నారాయణ, గురవయ్య, లక్ష్మీనారాయణ, మురళి పాల్గొన్నారు.

ఆరు నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి..

- మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయడానికి ముందు నిలవాలి
- మంత్రుల పర్యటనలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి




రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, అజయ్‌కుమార్, ఎంపీలు,ఎమ్మెల్యే

ఖమ్మంరూరల్/కూసుమంచి : ఖమ్మం రూరల్ మండలంలోని దానవాయిగూడెం నుంచి పాపటపల్లి వరకు బీటీ రహదారి నిర్మాణానికి రూ.33కోట్లు మంజూరు కాగా... ఆరు నెలల్లో పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తానని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. దానవాయిగూడెంలో రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామన్నపేటలో జరిగిన బహిరంగ సభలో కందాల మాట్లాడుతూ 50 ఏళ్లగా ఈప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న బీటీ రహదారి విస్తరణ పనులకు మోక్షం కలిగిందని తెలిపారు. దానవాయిగూడెం, రామన్నపేట ప్రజలకు ఇబ్బందిగా ఉన్న డంపింగ్‌యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని, నియోజకవర్గంలో అన్ని అంతర్గత రహదారుల నిర్మాణం మూడు నెలల్లో పూర్తిచేస్తానని చెప్పారు. పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రహదారి విస్తరణ పనులను కూడా సీఎం కేసీఆర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని వెల్లడించారు. కాగా, నియోజకవర్గానికి రూ.వందల కోట్లు నిధులు ఇస్తున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేయడానికి పాలేరు ప్రజలు ముందు నిలవాలని కోరారు. ఈసమావేశంలో భాగంగా 60వ డివిజన్ కార్పొరేటర్ నిరంజన్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రులు, ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పాపటపల్లి రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి అక్కడే తిరిగి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. తొలుత దానవాయిగూడెంలో మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, అజయ్‌కుమార్ తదితరులను బీఆర్ఎస్ కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. ఇక కూసుమంచి మండలం ఈశ్వరమాధారం, రాజుపేటల్లో నిర్మించనున్న వంతెన, బీటీ రహదారుల నిర్మాణ పనులకు మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. తొలుత కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, రాజుపేటలోని ఎమ్మెల్యే కందాల నివాసంలో మంత్రులు తేనీటి విందు స్వీకరించారు. ఈకార్యక్రమాల్లో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు, రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీలు బెల్లం ఉమ, బానోతు శ్రీనివాస్‌నాయక్, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుతో పాటు ఇంటూరి శేఖర్, వాసంశెట్టి వెంకటేశ్వర్లు, వాసంశెట్టి అరుణ, మోదుగు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి..

నేలకొండపల్లి: రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, అమ్మగూడెం సర్పంచ్ గండు సతీష్



మంత్రుల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్పొరేటర్ నిరంజన్

ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. రైతులు చెరుకు సరఫరా చేసేందుకు రహదారిని విస్తరించడమే కాక, అమ్మగూడెం – ఆరెగూడెం, ఎన్నెస్పీ కాలువ కట్ట – కోనాయిగూడెం వరకు బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం మంత్రి రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ సందర్శించి క్రషింగ్ విధానంపై ఆరా తీశారు. ఫ్యాక్టరీ అధినేత, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎండీ నామ కృష్ణయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరరావుతో పాటు దండా పుల్లయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, తన్నీరు కృష్ణమూర్తి, చింతనిప్పు సైదులు, మంకెన వెంకటేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఇఫ్టూ ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. శుక్రవారం ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి ఉద్యోగుల మాదిరిగానే పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.21 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను వెంటనే రద్దు చేసి రెగ్యూలర్ చేయాలని కోరారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ నోటిఫికేషన్ల విడుదల చేస్తూ నిరుద్యోగులను మభ్యపెట్టి మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన



ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కోర్కెలు తీర్చకుంటే ఐక్య ఉద్యమాలను చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జె.మురళీ, నాయకులు ఆనంద్, కమలమ్మ, రమా, సుజాత, వీరకుమారి, కౌసల్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది కుటుంబంపై దాడి అమానుషం

ఖమ్మం మామిళ్లగూడెం: దళిత లాయర్ కుటుంబంపై దాడి అమానుషమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేవీ.కృష్ణారావు అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై శనివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రజాసంఘాలు, అన్ని పార్టీల నేతలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ మాట్లాడుతూ.. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుంతేటి వీరభద్రం, విజయ్, ప్రభాకర్, శ్రీను, ఎస్‌కె.నజీమా, రెహమాన్, భద్రూనాయక్, వీరభద్రం, భద్రూనాయక్, కనకయ్య, రాజు భాస్కర్, ఉపేంద్ర, సతీష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: బస్ డిపో రోడ్‌లో రేపు జరిగే అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ల మహాసభను జయప్రదం చేయాలని మాజీ కౌన్సిలర్, డీసీఎంఎస్ డైరెక్టర్ జక్కుల లక్ష్మయ్య కోరారు. శుక్రవారం బురాన్‌పురంలో జరిగిన సమైఖ్య రజక సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ల సమస్యలు పరిష్కారం కోసం ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ల సంఘం అధ్యక్షుడు వీరబాబు, పంతంగి రవికుమార్, దర్గయ్య, మంగ, పుష్ప, సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ మంగీలాల్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

‘జాగృత్’ చేయూత

ఖమ్మం వైద్యవిభాగం: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన డెంకని వెంకన్న ఇటీవల తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతడి కాలు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న జాగృత్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్ వెంకన్న పరామర్శించి వైద్య చికిత్స నిమిత్తం ట్రస్ట్ తరఫున శుక్రవారం రూ.5వేలు ఆర్థికసాయమందించారు. ఈ కార్యక్రమంలో కేసగాని శ్రీను, మేకల శ్రీను కేసగాని నరసింహారావు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

లకారం ట్యాంక్‌బండ్‌పై ఠానునాయక్ విగ్రహం

ఖమ్మం అర్బన్: గిరిజనుల ఆత్మగౌరవ ప్రతీకైన జాటోతు ఠానునాయక్ విగ్రహాన్ని త్వరలో లకారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయనున్నట్లు రఘునాథపాలెం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, ఠానునాయక్ విగ్రహ ఏర్పాటు కమిటీ జిల్లా కన్వీనర్ అజ్మీర వీరునాయక్ తెలిపారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సేవాలాల్‌సేన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్‌తో కలిసి మాట్లాడారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు ఠానునాయక్ నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది పేదలకు వేలాది ఎకరాల భూమిని పంచిపెట్టారన్నారు. ఇందుకోసం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి స్థలం కోరిన వెంటనే ట్యాంక్‌బండ్‌పై స్థలం కేటాయించడంతో మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో గుగులోతు శ్రీనివాస్ నాయక్, కోర్రా రమేష్, నునావత్ రవి, బహదూర్ లాల్, సక్రు, వాంకుడోతు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

పాత పద్ధతిలో రిక్రూట్‌మెంట్ జరగాలి..

ఖమ్మం అర్బన్: పోలీస్ అభ్యర్థులకు పాత పద్ధతిలోనే రిక్రూట్‌మెంట్ నిర్వహించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 9వ తేదీన ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్, ఏఐవైఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మదోజ్ శ్రవణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోట ప్రేమ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ హెచ్చరించారు. ఆయా సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని టేకులపల్లి ప్రాంతంలో దున్నపోతుకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పోలీస్ రిక్రూట్‌మెంట్ విధానాన్ని పాత పద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శభాష్‌రెడ్డి, ప్రకాష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు లింక్ కాల్వలు ఏర్పాటు చేయాలి..

తిరుమలాయపాలెం: భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా చెరువులకు లింకు కాల్వలు ఏర్పాటు చేసి చెరువులన్నింటినీ నింపాలని సీపీఎం నాయకులు శుక్రవారం మండల తహసీల్దార్ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని చెరువులకు మాత్రమే నీరు చేరుతుందని, చెరువులకు కాల్వలు ఏర్పాటు చేసి చెరువులు నింపాలని కొన్నేళ్లుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నర్సయ్య, నాగటి సురేష్, కొమ్ము నాగేశ్వరరావు, నెర్సుల వెంకటేష్, కొమ్ము వెంకన్న పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి..

రఘునాథపాలెం: రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ నర్సింహారావుకు విన్నవించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు కటిక నారాయణ, ఖమ్మం టౌన్ అధ్యక్షుడు లేళ్ళ లక్ష్మణ్ ముదిరాజ్ తదితరులు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాలెపు సత్యనారాయణ, చేకూరి నర్సింహరావు, రేమళ్ళ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్‌లను ప్రైవేటీకరణ చేయొద్దు..

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి/ఖమ్మం గాంధీచౌక్: స్కీమ్‌లను ప్రైవేటీకరణ చేయొద్దని, బడ్జెట్ పెంచి పథకాలను బలోపేతం చేయడంతో పాటు స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, సీటు జిల్లా నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఖమ్మం ధర్నాచౌక్‌లో నిరసనలు తెలిపిన సందర్భంగా వెంకటేశ్వరరావు, నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో నాగేశ్వరరావు మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 లు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ



ఖమ్మం అర్బన్: దున్నపోతుకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, కె.సుధారాణి, మంగ, ఉమా, రమ, రమణ, రమ్య, సునీత, నిర్మల, ఝాన్సీ, స్కీమ్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

తేమశాతం నిబంధన సడలించాలి..

ఖమ్మం సహకారనగర్: ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం నిబంధనలు సడలించి కొనుగోళ్లు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్వో శిరీషకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరి కోసి 20 రోజులకు పైగా ధాన్యం ఆరబెట్టినా వాతావరణంలో మార్పులు వల్ల తేమ శాతం తగ్గకపోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తోందని తెలిపారు. 2022లో నూతన పాస్ పుస్తకాలు పొందిన వారికి కూడా రైతు బంధు మంజూరు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, మీరా, చెరుకుమల్లి కుటుంబరావు, కూచిపూడి మధు, కొల్లేటి ఉపేందర్, ప్రవీణ్, వెంకటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే కృషి చేయాలి

ఖమ్మంరూరల్/ఖమ్మంమామిళ్లగూడెం: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా, మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గీతామూర్తి అన్నారు. శనివారం మండలంలోని సత్యనారాయణపురంలో జరిగే పాలేరు అసెంబ్లీ బూత్ కమిటీ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కొండపల్లి విస్తృత పర్యటన చేసి మాట్లాడగా, పార్టీ జిల్లా కార్యాలయంలో గీతామూర్తి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దించడానికి జిల్లాస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కమిటీలను నియమించుకొని ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలన పట్ల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని కమ్యూనిస్టులు పాలేరులో ఆదరణ తగ్గిపోయిందని పేర్కొన్నారు. వేర్వేరుగా



సమావేశంలో మాట్లాడుతున్న గీతామూర్తి

జరిగిన ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాలతీ, జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ విజయలక్ష్మి, నాయకులు నున్నా రవి, ఎం. సంతోష్‌రెడ్డి, ఎన్. రాంమోహన్‌రెడ్డి, ఎల్లారావుగౌడ్, బి. నాగరాజు, ప్రభారి విద్యాసాగర్, పమ్మి అనిత, అశ్విని, మల్లీశ్వరి, సరస్వతి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

‘హార్వెస్ట్’ ఎన్‌సీసీ కేడెట్ల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని కృష్ణప్రసాద్ మెమోరియాల్ పాఠశాల ఆవరణలో 11వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ‘ఎ’సర్టిఫికెట్ కోసం నిర్వహించిన పరీక్షల్లో హార్వెస్ట్ విద్యార్థులు మొత్తం 38 మంది కేడెట్స్ సాధించారు. జూనియర్ వింగ్ నుంచి 21, జూనియర్ డివిజన్ నుంచి 17మంది అర్హత సాధించి సర్టిఫికెట్లు పొందారు. ఈమేరకు పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు జి.బాలకృష్ణ, ఎ.మమత విద్యార్థులను అభినందించారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రచ్చా శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో ఏఎన్ఎం, సిబ్బంది, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసవాలపై గర్భిణులకు నమ్మకం కలిగేలా సేవలు అందించాలని అన్నారు. వైద్యాధికారులు డాక్టర్ నాగమణి, డాక్టర్ సన, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘త్రివేణి’లో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని తీసుకొచ్చేందుకు ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. స్థానిక కార్పొరేటర్ సరిపుడి రమాదేవి విజేతలను ఎంపిక చేయగా బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. త్రివేణి–కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు వై.వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు మురళీకృష్ణ, శ్రీదేవి, ముస్తాఫా, చార్లెస్, అశోక్, సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా ‘ఎస్‌ఎఫ్‌ఎస్’ వార్షికోత్సవం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం 28వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య, సందేశాత్మక గీతాలను ఆలపించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు పాడిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ బొంతు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెవరెండ్ సురేష్‌బాబు, కవి సీతారాం, మేయర పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, బీఆర్ఎస్ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, రాజ్‌కుమార్, కె.ప్రసాద్, డాక్టర్ సిద్ధార్థ, యూడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, రవితో పాటు ఎస్‌కె. జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

‘ప్రియదర్శిని’లో సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ వారిచే కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థినులకు అవగాహనా సదస్సు జరిగింది. కళాశాల చైర్మన్ కె. నవీన్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ లక్ష్య సాధన కోసం భవిష్యత్‌లో ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ డైరెక్టర్లు రంజిత్, శ్రీరాం అవగాహన కల్పించగా.. ప్రిన్సిపాల్ బి.గోపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్‌బీఐటీ’ విద్యార్థినులకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: మేధా సర్వో డ్రైవ్స్ కంపెనీ నియామకాలకు తమ కళాశాల విద్యార్థులు ఎన్నికైనట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో విద్యార్థినులను అభినందించి మాట్లాడారు. మొత్తం 800 మంది పాల్గొనగా 10 మంది తమ విద్యార్థినులు ఎంపికయ్యారని, కళాశాలలో నాణ్యమైన బోధన అందించటం ద్వారానే ఇంతటి ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, సుభాష్‌చందర్, వంశీ, ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంథం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

మండల కేంద్రాల్లో పీఆర్టీయూ,పీఆర్టీయూ తెలంగాణ, టీపీటీఎఫ్ తదితర సంఘాలకు చెందిన 2023 క్యాలెండర్లు, డైరీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఆతర్వాత ఆయా సంఘాల ప్రాముఖ్యతను వివరించి, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పలువురు నాయకులు, సంఘం బాధ్యులు పిలుపునిచ్చారు. - సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం సహకారనగర్: పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ

పందుల బెడద ఇంకెన్నాళ్లు..!

ప్రజలపై దాడి చేస్తున్న వైనం

- స్వైరవిహారంతో నెలకొంటున్న వివాదాలు
- దేవాలయం, బడుల వద్ద విచ్చలవిడిగా సంచారం
- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు
- పట్టించుకునే నాథుడే లేరు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామంలో పందుల స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో గ్రామంలో నానాటికి వివాదాలు నెలకొని తారాస్థాయికి చేరుతున్నాయి. ఇటీవల కాలంలో పలువురిపై దాడులు కూడా చేశాయి. వెంకమ్మ అనే వృద్ధురాలిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచగా.. అదే గ్రామానికి చెందిన మరియమ్మ అనే మహిళపై కూడా దాడి చేసి చేతి వేలుని కొరికేశాయి. ప్రధాన సెంటర్‌లోని దేవాలయాలు, పాఠశాల వద్ద వందల సంఖ్యలో పందులు తిరుగుతుండటంతో ప్రజలు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పందులు నివాసం ఉంటున్న పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.


నోటీసులు ఇచ్చినా.. రాని మార్పు..

పంచాయతీ పాలకులు అనేక మార్లు పందుల పెంపకందారులకు నోటీసులు ఇచ్చినా, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినా వారిలో మాత్రం మార్పు రావటం లేదు. పందుల వలన గతంలో గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని



చెరువుమాదారం ప్రధానసెంటర్‌లోని దేవాలయం వద్ద పందుల సంచారం

గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల ఓ పాఠశాల పక్కన పంది చనిపోవటంతో దుర్గంధం వెదజల్లడతో విద్యార్థులు, ఉపాధ్యాయులు వాసన భరించలేక ఇంటి బాట పట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల సంచారంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సర్పంచ్ ఈవూరి సుజాతను వివరణ కోరగా.. ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని, కానీ పందుల యజమానులకు 5 సార్లు నోటీసులు ఇచ్చాం, 3 సార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



దాడిలో గాయపడిన మరియమ్మ(ఫైల్), వెంకమ్మ(ఫైల్)